క్లుప్తంగా

టీచర్స్ ఒలింపిక్స్ పోటీల్లో ఉదయ్‌కృష్ణ ప్రతిభ



మాచరలో ఉదయ్‌కృష్ణను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన టీచర్స్ ఒలింపిక్స్ పోటీల్లో మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్. ఉదయ్‌కృష్ణ ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి షటిల్ సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆయనను బుధవారం పాఠశాలలో హెచ్ఎం రమాదేవి, సహచర ఉపాధ్యాయులు సత్కరించారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

మండపేట: జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మండపేట క్రీడాకారులు గౌతమ్ సంజయ్, బల్ల సత్యనారాయణ, శివకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి బుధవారం ఆర్థిక సాయం చేశారు. ఈనెల 30న జమ్మూకశ్మీర్లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటున్నారు. ప్రయాణ ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.9 వేలు అందించారు.

స్వచ్ఛతాహి సేవపై నాటక ప్రదర్శన



హసన్‌బాదలో 'స్వచ్ఛత మన బాధ్యత' నాటకాన్ని ప్రదర్శిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద గ్రామ సర్పంచ్ స్వతహాగా నాటక కళాకారుడు కావడం, ద్రాక్షారామ నాటక కళా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేస్తుండటంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని బుధవారం వినూత్నంగా నిర్వహించారు. చెట్లు నరకడం వలన వచ్చే అనర్థాలు, చెత్త బయట వేయడం వలన ప్రబలే రోగాలు తదితర అంశాలపై స్వచ్ఛత మన బాధ్యత అనే నాటకాన్ని రూపొందించి పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో కలసి ప్రజల్లో అవగాహన పెంచేలా నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శన గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సర్పంచ్ సతీష్ రావును పలువురు అభినందించారు.

మణికంఠకు గ్రామస్తుల సత్కారం



మణికంఠను సత్కరించిన సహచర ఉద్యోగులు, అముజూరు పెద్దలు

కె.గంగవరం: ఇటీవల జిల్లా పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధికారుల నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠకు గ్రామ పెద్దలు, సహచర ఉద్యోగులు బుధవారం ఘనంగా సత్కరించారు. అముజూరు సచివాలయంలో నిర్వహించిన సత్కార సభలో పలువురు మాట్లాడుతూ మండల నుంచి ఉత్తమ సేవా పురస్కారానికి మణికంఠ ఎంపికవడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని పదవులు పొంది ఉద్యోగంలో రాణించాలని కోరారు. గ్రామ సర్పంచ్ నానా పరపు కళ్యాణి, కూళ్ల, పాణింగపల్లి సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య, పలు సచివాయాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

కాజులూరు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు బుధవారం విలేకరులకు బుధవారం తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీవో వి.మాధవి తెలిపారు. పెనుమళ్ళ ఎస్సీ పేట అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టు ఎస్సీ, పల్లిపాలెం-1 బీసీ-డి, ఆర్యావటం వనుం వారిపేట-జనరల్ కేటగిరీలకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. పదో తరగతి ఉతీర్ణులై 1.7.2024 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉన్న స్థానిక వివాహిత మహిళ ఈ పోస్టులకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 25వ తేదీ బుధవారం నుంచి తాళ్లరేవు ఐసీడీఎస్ కార్యాలయం పని వేళల్లో దరఖాస్తు ఫారాలు, సర్టిఫికెట్లు, జిరాక్సులతో 5వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల్లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మండపేట: మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని బుధవారం విధుల్లో చేరిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తెలిపారు. బుధవారం మెయిన్ రోడ్డు, కలువపువ్వు సెంటర్, 2వ వార్డు బ్యాంకు కాలనీ, గొల్లలగుంట వీధుల్లో ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రులు చుండ్రు రామకృష్ణ, సందక ఉమామహేశ్వర రావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలతో పంటకు మేలు

- జింక్ లోపిస్తే ప్రమాదమే..
- దిగుబడులపై ప్రభావం

రామచంద్రపురం రూరల్: మొక్కల పెరుగుదలకు అవసరమయ్యే ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్, కాల్షియం, మెగ్నీషియం, రాగి లాంటి 16 పోషక పదార్థాలు చాలా ముఖ్యం. వీటిలో జింక్ చాలా ప్రాధాన్యత గల పోషక పదార్థం. ప్రధాన పోషకాలతో పోల్చితే ఇది చాలా తక్కువ పరిమాణంలో అవసరం. కానీ దీని ప్రాముఖ్యత ప్రధాన పోషకాలతో సమానంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వరిలో జింక్ లోపం, నివారణ పద్ధతుల గురించి రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ పలు విషయాలు వివరించారు.



జింక్ లోపించిన వరి పంట

వరిలో జింక్ లోపం

జింక్ లోపం వరిలో నారుమడిలోను, నాటిన తర్వాత కూడా కనిపిస్తుంది. సాధారణంగా నాట్లు వేసిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల మధ్య నుంచి ఆరో వారం వరకు పంటలో ఈ లోపం లక్షణాలు కనిపిస్తాయి. ప్రధాన పోషకాలు తగినంత వేసినప్పటికీ రెండు నుంచి నాలుగు వారాల సమయంలో పంట సరిగా పెరగకపోయినా, ఏపుగా లేకపోయినా, దుబ్బులు సరిగ్గా వేయకపోయినా అది జింక్ లోపంతోనే అని గ్రహించాలి. దూరం నుంచి చూస్తే నాట్లు సరిగా అంటుకోక నాటిన మొక్కలు గుంపులు, గుంపులుగా చనిపోయి ఖాళీలు కనిపిస్తాయి. పొలమంతా జింక్ లోపంతో పసుపు పచ్చగా కనిపిస్తుంది. దగ్గరి నుంచి చూస్తే వరి మొక్కల్లో పైనుంచి మూడు లేక నాలుగో ఆకులో మధ్య ఈనే మొదలు భాగం మాత్రం ఆకుపచ్చ రంగు కోల్పోయి పసుపు లేక పసుపుతో కూడిన తెలుపు రంగులోని మారి ఉంటుంది. ఆకులోని మిగతా భాగమంతా ఆకుపచ్చగానే ఉంటుంది. ముదురాకుల్లో ఆకుల కొనల వద్ద మధ్య ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు లేక ఇటుకరంగు మచ్చలు కనిపించి ఆకు అంతా వ్యాపిస్తాయి. లోపం ఉన్న ఆకులు చిన్నవిగా, నూలు కండెలాగా మారి గిడస బారతాయి. ఆకులు పెళుసుగా మారి వంచగానే శబ్దం చేస్తాయి.

నివారణ చర్యలు

మొదట వరి పంట పండించే ముందు నేలల్లో మట్టి పరీక్ష చేయించుకుని జింక్ తగినంత ఉందో లేదో తెలుసుకోవాలి. జింక్ లోపం ఉంటే తప్పనిసరిగా నేలల్లో మొదటనే సరైన మోతాదులో జింక్ సల్ఫేట్‌ను వేసుకుని పంటపైన లోపం రాకుండా నివారించుకోవాలి. వరి పంటకైతే ఎకరాకు 20 కేజీల జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో నాటే ముందే వేసుకోవాలి. ఇలా మూడు పంటలకు ఒకసారి గానీ, రెండు సంవత్సరాలకోసారి గాని వేసుకోవాలి. వరుసగా ప్రతి సంవత్సరం వరి తర్వాత వరి వేస్తే గనుక ప్రతి సంవత్సరం రబీలో వరి వేసే ముందు జింక్ వేసుకోవాలి. సమస్యాత్మక నేలలు (క్షారం, చవుడు, సున్నపు నేలలు) అయితే జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 40 కేజీల చొప్పున వేసుకోవాలి. దీని నివారణకు ఎకరాకు 10 నుంచి 12 కేజీలు జింక్ వేసుకుంటే లోపాన్ని నివారించవచ్చు.



ఎస్.సత్యప్రసాద్, రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి

రామచంద్రపురం, మండపేట నియోజవర్గాల్లో వరి పంట సాగు వివరాలు		
మండలం	విస్తీర్ణం(ఎకరాల్లో)	రైతులు
రామచంద్రపురం	18,236	12,461
కె.గంగవరం	15,656	11,901
మండపేట	16,304	9,488
కపిలేశ్వరపురం	15,762	10,095
రాయవరం	14,402	9,223
కాజులూరు	19,072	16,102

వేసిన పంటపై జింక్ లోపం కనిపిస్తే..

జింక్ లోపించిన లక్షణాలు ఒకవేళ పంటపై కనిపిస్తే 0.2 శాతం జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని అంటే 10 లీటర్ల నీటికి కలిపి 20 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేసి జింక్ లోపాన్ని సవరించుకోవచ్చు. ఇలా వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేసి పంటపై జింక్ లోపాన్ని నివారించుకోవచ్చు. దాదాపు 200 కేజీల పశువుల ఎరువు, కంపోస్టు, కోళ్ల పెంట, ఫిల్టర్ మడ్డి లాంటి సేంద్రియ ఎరువులతో 15 కేజీల జింకు సల్ఫేట్‌ను కలిపి ఒక నెల మాగనిచ్చి వరి దుక్కిలో నాటే ముందు వేస్తే దిగుబడుల్లో గణనీయమైన మార్పు కనబడుతుంది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ఎంఈఓ కార్యాలయం వద్ద ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న వెంకన్నబాబు, సమగ్ర శిక్ష ఉద్యోగులు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ చైర్మన్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం ఎంఈఓ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ప్లకార్డులు చేపట్టి నిరసన చేపట్టారు. వెంకన్నబాబు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల తరహాలో సమగ్రశిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించేలా వార్షిక బడ్జెట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు రెండు మూడు నెలలకోసారి రావడంతో ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారంగా మారుతోందని వాపోయారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఆగస్ట్, సెప్టెంబర్ నెలల జీతాల బడ్జెట్ అన్ని జిల్లాలకు తక్షణం విడుదల చేయాలని కోరారు. సమ్మె జీతాలు, మినిమం టైం స్కేల్, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడం తదితర డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని సీఆర్ఎంటీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్‌లు, ఐఆర్‌పీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోవిందు మృతి

- రెండు నియోజకవర్గాల కో–ఆర్డినేటర్ల నివాళి
- పార్థివ దేహాన్ని సందర్శించిన పార్టీ శ్రేణులు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, మాచర గ్రామ శివారు మాచర మట్లలుకు చెందిన శీలం గోవింద్ (49) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. మాచరమట్లులోని ఆయన నివాసం వద్ద పార్థివదేహాన్ని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు, రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ సందర్శించి నివాళి అర్పించారు. గోవిందు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ మండలంలో పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. సౌమ్యుడైన గోవిందు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సత్సంబంధాలతో మెలిగారు. ఈయనకు భార్య సుభాషిణి, కుమారులు పవన్, రామనారాయణ ఉన్నారు. 2014లో భార్య సుభాషిణి వైఎస్సార్ సీపీ తరపున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేశారు. తన సామాజికవర్గ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ శెట్టిబలిజ సంఘ బలోపేతానికి కృషి చేశారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన గోవిందు మండలంలోని పలు ఆలయాల నిర్మాణం, నిర్వహణలకు విరాళాలు అందజేసేవారు.



గోవింద్ పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న కో-ఆర్డినేటర్లు త్రిమూర్తులు, సూర్యప్రకాష్



శీలం గోవిందు (ఫైల్)

రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో ప్రస్తుత ఎంపీ పిల్లి సుభాష్ చంద్ర బోస్ రాజకీయ, ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆయనకు సన్నిహితుడిగా మెలిగారు. మంచి వ్యక్తి మృతి చెందడంతో మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గోవిందు పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించిన వారిలో సర్పంచ్ వాసంశెట్టి సునీత, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్ పలివెల మధు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు ఉన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో వేగాయమ్మపేట మహాలక్ష్మమ్మ హిందూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సోమసుందరం బుధవారం విలేకరులకు తెలిపారు. బాలుర విభాగంలో ఖోఖో అండర్-17 సీహెచ్ ధనుష్‌కుమార్, అండర్-14 పి.సాయిగణేష్, వాలీబాల్ అండర్-14 పి.సూర్యతేజ, కబడ్డీ అండర్-14 పి.సూర్యతేజలు అదే విధంగా బాలికల విభాగంలో ఖోఖో అండర్-17 కె.రూస్సీలక్ష్మీదుర్గ, కె.అనిత, ఖోఖో అండర్-14 మంజూష, వాలీబాల్ అండర్-17 వైజేవీడీ శ్రీలక్ష్మి, వాలీబాల్ అండర్-17 పి.గీత అన్మిత, ఖోఖో అండర్-14 కె.అనంతలక్ష్మి, కబడ్డీ అండర్-14 సీహెచ్ జయలక్ష్మీశ్రీ, వాలీబాల్ అండర్-14 కేఎంవీవీ లక్ష్మి, ఖోఖో అండర్-14 కేఎంవీవీ లక్ష్మి విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల చివరిలో కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో జరిగే జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటోల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయిని అనురాధలను ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, గ్రామ సర్పంచ్ అంబటి తుకారం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన వేగాయమ్మపేట విద్యార్థులు

'చెకుముకి' సంబరాలకు 454 మంది హాజరు

కపిలేశ్వరపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పాఠశాల స్థాయి 'చెకుముకి' సైన్స్ సంబరాలకు 454 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పెద్దింశెట్టి లెనిన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పరీక్ష ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 50 మంది, మాచర పాఠశాలలో 40, వాకతిప్పలో 31, కాలేరులో 28, అంగరలో 10, టేకిలో 56, వల్లూరులో 70, నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 43, అంగరలోని శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో 126 మంది చెకుముకి పరీక్ష రాశారు. సంబరాల నిర్వహణకు సహకరించిన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వేదిక నాయకులు అభినందనలు తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో అక్టోబర్ 1న మండల స్థాయి సంబరాలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.



కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

రామచంద్రపురం: రానున్న రబీ సీజన్‌లోగా రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు. బుధవారం రామచంద్రపురం పట్టణం లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో నీటిపారుదల, వ్యవసాయం, రోడ్లు భవనాలు, గ్రామీణ నీటి సరఫరా, డ్రైన్ల శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని రైతులు తమ సమస్యలను అధికారుల ముందుంచారు. డ్రైన్లు, పంట కాలువలు గుర్రపుడెక్కతో నిండి ఉన్నాయని, రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని పలు సమస్యలను అధికారులకు మంత్రి సమక్షంలో తెలిపారు. మంత్రి మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను తెలపడానికి నియోజకవర్గ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంబంధిత కమిటీలో మండలాల నుంచి ఇద్దరు లేదా ముగ్గురు రైతులు, రామచంద్రపురం పట్టణం నుంచి ఇద్దరు రైతులు, రైతు సంఘాల నుంచి సభ్యులుగా ఉండాలన్నారు. కమిటీ వివరాలు అధికారులకు తెలియజేయాలని, రైతు సమస్యలు ఏవైనా సంబంధిత కమిటీ ద్వారా అధికారులకు తెలపాలన్నారు. రానున్న రబీ సీజన్ నాటికి పంట కాలువలు, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాలువల్లో పూడిక మూలంగా శివారు పంట పొలాలకు నీరు అందట్లేదని పూడికతీత పనులు చేపట్టాలన్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్లపై గుంతలు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మంచినీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. పాడైపోయిన లాకులకు అవుట్ ఫాల్ స్లూయిస్‌ల వద్ద షట్టర్లకు మరమ్మతులు నిర్వహించాలని హెడ్‌వర్క్స్ అధికారులకు సూచించారు. రైతు సమస్యలు ఏమైనా సరే తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము, జలవనరులు వ్యవసాయం గ్రామీణ నీటి సరఫరా, డ్రెయిన్లు తదితర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- డ్రైన్లలో పూడిక తీత, పారిశుధ్య పనుల ప్రారంభం

మండపేట: స్వచ్ఛతలో జిల్లాలోనే నంబర్ వన్ స్థానంలో మండపేట పట్టణాన్ని నిలిపేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని పలు వీధుల్లోని డ్రైన్లలో పూడికతీత, పారిశుధ్య నిర్వహణ పనులను బుధవారం చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను దుర్గారాణి పరిశీలించారు. ప్రత్యేకంగా నియమించిన 40 మంది కార్మికులతో పూడిక తీత పనులు చేపట్టినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. వాణీమహల్ జంక్షన్ నుంచి కలువపువ్వు సెంటర్ వరకూ బుధవారం కార్మికులు డ్రైన్లలోని పూడికను బయటకు తీశారు. వర్షం వచ్చే అవకాశం ఉన్నందున తీసిన పూడికను వెంటనే ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నామని తెలిపారు. రెండు నెలల క్రితం చేపట్టిన రామచంద్రుడు కాలువ పనుల వల్ల అందులోని వ్యర్థాలన్నింటినీ ఇరిగేషన్ అధికారులు రోడ్లమీదే విడిచిపెట్టారని చైర్ పర్సన్ చెప్పారు. శానిటేషన్ సమస్యను దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ స్పందించి రెండు జేసీబీల ద్వారా ఈ వ్యర్థాలను దూర ప్రాంతాలకు తరలిస్తోందన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి ఆ పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముక్కా దాలయ్య, పాలచర్ల వెంకన్నబాబు, శానిటరీ మేస్త్రీలు చుండ్రు రామకృష్ణ, సందక ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైన్లలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

దీన్‌దయాళ్ సేవలు ఆదర్శం



రామచంద్రపురంలో దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అముజూరులో దీన్ దయాళ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

రామచంద్రపురం: బీజేపీ హైందవ రాష్ట్ర సిద్ధాంత కర్తగా చేసిన సేవలు ఆదర్శనీయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ ట్రేడ్ సెల్ అధ్యక్షుడు కొట్టువాడ హరిబాబు అన్నారు. పట్టణ అధ్యక్షులు కేశవ రాఘవేందర్ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గానాల కళ్యాణ్, జిల్లా ఉపాధ్యక్షుడు యాంఢ్ర బుల్లబ్బులు, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పులిగడ్డ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని అముజూరులో అంత్యోదయ సిద్ధాంత రూపశిల్పి, జనసంఘం పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ జయంతి వేడుకలను బుధవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి అనకాపల్లి జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి కర్రి చిట్టిబాబు తదితర బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిట్టిబాబు మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ గొప్ప తత్వవేత్తని, ప్రభుత్వ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరాలనే లక్ష్యంతో పనిచేశారన్నారు. కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ సలాది శేఖర్, నున్న సత్యనారాయణ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాయవరం: పంటల సాగులో రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. లొల్ల, సోమేశ్వరం గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలుతగా ఏవో ప్రభాకర్ ఈ రెండు గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి వి.రమణారావు తమశాఖ ద్వారా రైతులకు అందుతున్న పథకాలను వివరించారు. సమావేశంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, స్థానిక నేత సుంకవిల్లి గంగరాజు, పంచాయతీ కార్యదర్శి పల్లేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

పల్లిపాలెంలో..

కాజులూరు: సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకుని వ్యవసాయ సేద్యంలో పరికరాలను, యంత్రాలను వినియోగిస్తూ నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం పల్లిపాలెంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సేద్యంలో అందుబాటులోకి వచ్చిన డ్రోన్ పరికరం దాని ఉపయోగాలపై రైతులకు వివరించారు. అయన మాట్లాడుతూ వ్యవసాయ సేద్యంలో యంత్ర పరికరాలు వినియోగించటం ద్వారా పనిభారం తగ్గడంతో పాటు అనవసరపు వ్యయాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, అనుబంధ వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆ గ్రామాల సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణల నేతృత్వంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో మెళకువలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.

చిరుత సంచారంపై ఆందోళన చెందొద్దు

- ఏమరపాటు కూడా తగదు
- ఆర్డీవో సుధాకర్

మండపేట: కొద్ది రోజులుగా లాలా చెరువు సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచరించిన చిరుత పులి ఇప్పుడు కడియం మండలంలోకి ప్రవేశించినట్టు నిర్ధారణ కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. చిరుత సంచారంపై ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని రామచంద్రపురం ఆర్డీవో సుధాకర్, అటవీశాఖాధికారి ఎంవీ ప్రసాదరావు, టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి అన్నారు. అదే సమయంలో ఎవరూ ఏమరపాటుగా కూడా ఉండడం తగదన్నారు. ఏడిద, దుళ్ల, మండపేట ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్న నేపథ్యంలో బుధవారం అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. చిరుత పులి సంచారంపై కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో చేసే పుకార్లను నమ్మవద్దని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల అధికారులు చెప్పిన మాటలే వాస్తవమన్నారు. రాత్రిపూట ఎవరూ పశువుల చావిడల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో గడప వద్ద పడుకోవద్దన్నారు. తెల్లవారుజామునే వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు గుంపుగా వెళ్లాలన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ఉండే వారు శబ్దాలు చేయాలన్నారు. పిల్లలను, వృద్ధులను బయటకు తిరగనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. చిరుత జాడ కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 180042 55909, 98491 56162, 97059 09066 కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఒకవేళ ఎవరైనా చిరుత పులిని చంపాలని చూస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ తేజేశ్వరరావు, అర్ఐ కంతంశెట్టి గౌరీదేవి, డిప్యూటీ తహసీల్దారు మెహెర్‌బాబా పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చినుకుపడితే చిత్తడే...

కె.గంగవరం: వర్షాకాలం వచ్చిందంటే చాలు కనీనం నడవడానికి కూడా వీలు లేకుండా ఉండే రహదారితో ఎదురుబిడియం కొంపల ప్రజలు గత 20 ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న కనీసం గ్రామం వైపు కూడా చూడడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని కుడుపూరు శివారు ఎదురు బిడియం కొంపలు గ్రామంలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కుడుపూరు గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఎదురుబిడియం కొంపలు గ్రామం ఉంది. ఇటు పంచాయతీ కుడుపూరు వెళ్లాలన్నా అటూ మార్కెట్‌కి ద్రాక్షారామ వెళ్లాలన్నా మట్టిదారే దిక్కు. కేవలం ఈ గ్రామానికి పంట చేలో నుంచి ఉన్న మట్టిదారి తప్ప మరో దారి లేదు. పంట చేలోని నీరు రోడ్డుపైకి వచ్చి కనీసం నడవడానికి కూడా ఉండడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే గ్రామానికి రాకపోకలు ఉండవని స్థానికులు చెబుతున్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే మంచంపై ఎత్తుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. పల్లెలు అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో కూడా కనీసం రోడ్డు కూడా లేకపోవడం చాలా దారుణమని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నామని ఇప్పుడైనా అధికారులు గ్రామాన్ని గుర్తించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఎదురు బిడియం కొంపలకు వెళ్లే దారి

భారీ అన్నసమారాధనలు

మండపేట/రాయవరం: గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా మండపేటలోని రావులపేట వీధి, రాయవరం మండలం పసలపూడిలోని గోపడితోటల్లో బుధవారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంయలో వచ్చి తరలివచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.